## వసతి గృహాలకు రూ. 50వేల విరాళం

**విశాలాంధ్ర - అమలాపురం :** అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మాణం తలపెట్టిన అర్చకుల వసతి గృహాలకు అమలాపురంనకు చెందిన సుమంగళి క్లాత్ షోరూం అధినేత తటవర్తి వెంకటరత్నం(రత్నాజీ) దంపతులు 50వేల రూపాయల చెక్‌ను ఆలయ చైర్‌పర్సన్ దూడల వీరీతదేవికి అందజేశారు. ఈ సందర్భంగా వీరీతదేవి మాట్లాడుతూ అర్చక క్వార్టర్స్ నిర్మాణంలో దాతలు అందరూ భాగస్వామ్యం కావడం చాలా గొప్ప విషయమని అన్నారు. ఆలయ అభివృద్ధికి దాతలు లక్షలాది రూపాయలు విరాళాలు ఇస్తున్నారని దాత తటవర్తి రత్నాజిని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యులు యేండూరి రాఘవ నాగేశ్వరరావు, నడింపల్లి వర్మ, ముంగర ప్రసాద్, పట్టణ వైఎస్సార్సీపీ యువత అధ్యక్షులు దూడల ఫణి తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మిలేరు రోడ్డులో దీపావళి షాపులు

**వినియోగదారులు లేక విక్రయాలు వెలవెల**

**విశాలాంధ్ర - మండపేట :** ఈ ఏడాది మండపేట దీపావళి షాపులు గుమ్మిలేరు రోడ్డులో వెలిశాయి. స్థానిక ఐటీఐ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న ఈ ప్రైవేట్ లే అవుట్‌లోని విశాలవంతమైన ప్రాంతంలో టపాసుల దుకాణాలు ఏర్పాటయ్యాయి. మండపేట పట్టణానికి సంబంధించి మొత్తం 24 షాపులకు లైసెన్స్‌లు జారీ చేసినట్టు తహశీల్దార్ తంగెళ్ళ రాజరాజేశ్వరరావు చెప్పారు. మండలంలో 9 షాపులకు అనుమతులు ఇచ్చామన్నారు. ఏడిద, తాపేశ్వరం, ద్వారపూడి గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు వ్యాపారులు లైసెన్సులు పొందారని తెలిపారు. టౌన్ ఎస్సైలు మద్దాల అశోక్, కోన అప్పారావులు మార్కెట్ పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. అగ్నిమాపక అధికారులు కూడా ఫైర్ సిబ్బందిని నియమించి అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. ఎస్సై కోన అప్పారావు, ఫైర్ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో దుకాణాల వద్ద నిబంధనలు కఠినతరం చేశారు. కొనుగోలు దారులకు, వ్యాపారులకు దీపావళి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సారి వాతావరణం అనుకూలించి నప్పటికీ పండుగ వాతావరణం కనిపించక పోవడంతో వ్యాపారులు నిరాశ చెందుతున్నారు.

## టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి

**విశాలాంధ్ర - ఉండ్రాజవరం:** దీపావళి టపాసులు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమా దాలు జరగకుండా నివారించవచ్చునని ఉండ్రాజవరం ఎస్ఐ కె. రామారావు అన్నారు. ప్రజలకు అత్యంత ప్రియమైన దీపావళి పండుగను ప్రమాదాలకు గురికాకుండా ఆనందించేందుకు ఆయన మండల ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు తెలిపారు. కాటన్ దుస్తులు ధరించి, దీపావళి క్రాకర్స్ కాల్చితే ప్రమాదానికి గురికాకుండా కాపాడుకోవచ్చన్నారు. తారాజువ్వలు, లక్ష్మీ బాంబులు వంటి వాటిని పోటీలకు దిగకుండా స్వచ్ఛందంగా కాల్చుకోవాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా పెద్ద ప్రమాదాలు సంభవిస్తాయన్నారు. కంపెనీ క్రాకర్స్ అట్టలపై ఇచ్చిన సలహాలు, సూచనలను కచ్చితంగా చదివి, పాటించాలన్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలకు ఎస్సై రామారావు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుక

**విశాలాంధ్ర - ఉండ్రాజవరం:** ఉండ్రాజ వరం శాఖా గ్రంథాల యంలో శనివారం ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతి వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసిన గొప్ప వ్యక్తి అని గ్రంథాలయ అధికారి గుత్తికొండ కృష్ణారావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పాఠకులు పాల్గొన్నారు.

## రూ.10 లక్షల విలువైన రేషన్ బియ్యం పట్టివేత

**విశాలాంధ్ర-కొవ్వూరు :** ఖమ్మం నుండి కాకినాడ తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. కొవ్వూరు గ్రామన్ బ్రిడ్జి వద్ద రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా కొవ్వూరు సివిల్ సప్లై అధికారులు ,పోలీసులు పట్టుకున్నారు. సుమారు పది లక్షల రూపాయల విలువ కలిగిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిడదవోలు సివిల్ సప్లయిస్ గోడౌన్‌లో దిగుమతి చేశారు. పది లక్షల రూపాయల బియ్యంతో పాటు లారీని కూడా సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలియజేశారు. లారీ డ్రైవర్ నాగూర్ మీరా బియ్యం యజమాని వెంకటేశ్వరరావులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## టీడీపీకి పెరుగుతున్న ఆదరణ

**విశాలాంధ్ర -దేవరపల్లి:** గ్రామీణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతున్నదని ఆంధ్ర ప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి పేర్కొన్నారు దేవరపల్లి మండలం బాబు షూరిటీభవిష్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రజలు అనేక కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు వైసిపి ప్రభుత్వానికి ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారని, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ జనసేన కూటమి విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఎస్సి సెల్ అధ్యక్షుడు చింతాల దాసు, తెలుగుదేశం పార్టీ గ్రామ టిడిపి అధ్యక్షుడునల్లమాటి నాగేశ్వరరావు, నాయకులు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

**విశాలాంధ్ర - అమలాపురం :** భారతదేశపు మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధులు, భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ 135వ జయంతి ఘనంగా జరిగింది. అమలాపురం పట్టణంలోని గొల్లగూడెంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూ పాఠశాలలో ఆయన విగ్రహానికి వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, 13వ వార్డు కౌన్సిలర్ సంసాని చంద్రశేఖర్ (నాని), మరియు పలువురు వైసీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించగా, టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గంటి హరీష్ బాలయోగి, టిడిపి పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు షేక్ షరీఫ్, పలువురు టిడిపి నాయకులు ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జనసేన నాయకులు అమలాపురం పట్టణ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ మహబూబ్ షరీఫ్ బాబ్జి, కాలేషా వలి తదితరులు పాల్గొన్నారు.

# బాణసంచా ప్రాంగణాల్లో పోలీసుల తనిఖీలు

**విశాలాంధ్ర - కాకినాడ :** జిల్లా ఎస్పీ ఎం. సతీష్ కుమార్ ఇచ్చిన ఆదేశాల అమలులో భాగంగా రెండు పోలీసు సబ్ డివిజన్ల పరిధి ప్రాంతాలలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా అమ్మే స్టాళ్ళ వద్ద నిర్వాహకులు పాటిస్తున్న భద్రతా ప్రమాణాలను జిల్లా అడిషనల్ ఎస్పీలు పి శ్రీనివాస్ (పరిపాలన), బి సత్యనారాయణ(ఆర్మ్డ్ రిజర్వ్), జిల్లా ఎస్పీ నియమించిన డిఎస్పి, ఇన్స్పెక్టర్ స్థాయి సెక్టోరల్ పోలీసు అధికారులు పరిశీలించారు. జిల్లాల్లోని వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో దీపావళి బాణసంచా అమ్మే స్టాల్స్ కోసం నిర్దేశించిన ప్రదేశాలలో వాటి నిర్వాహ కులు అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థలను పర్యవేక్షించారు. ఈ సెక్టోరల్ పోలీసు అధికారులు స్థానిక రెవెన్యూ, ఫైర్ బృందాలతో కలిసి బాణాసంచా అమ్మే స్టాల్స్ మధ్య కనీస దూరం వుండేలా, స్టాల్స్‌లో తగు మొత్తంలో నీటి, ఇసుక నిల్వలు వుండేలా, ఈ బాణాసంచా విక్రయ స్టాల్స్‌లో మైనర్లు ఎవరూ లేకుండా వుండేలన్నారు. అగ్ని ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉండేలా నిర్వాహకు లతో సమీక్షించి ఖచ్చితంగా అమలు అయ్యేట్టు తగిన చర్యలను తీసుకున్నారు. అలా కాకుండా ఏవైనా ఉల్లంఘనలు జరిగితే వెంటనే ఇచ్చిన తాత్కాలిక లైసెన్స్ రద్దు చేసి స్టాల్ సామాగ్రిని సీజ్ చేస్తామని సంబంధిత శాఖల అధికారులతో కలిసి నిర్వాహకులను హెచ్చరించారు. ఈ స్టాల్స్ ఏర్పాటు చేసిన ప్రదేశాలలో బాణాసంచా కొనుగోలుకు వచ్చే ప్రజలకు, రోడ్డు వినియోగ దారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ విభాగాల అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సెక్టోరల్ పోలీసు అధికారులు తనిఖీల సందర్భంగా స్థానిక పోలీసు స్టేషను సిబ్బందికి సూచించారు. సెక్టోరల్ పోలీసు అధికారులుగా ఈ తనిఖీల నిమిత్తం నియమించబడిన కాకినాడ, పెద్దాపురం సబ్ డివిజన్‌ల డీఎస్పీలు పి మురళీ కృష్ణారెడ్డి, జి లతా కుమారి, దిశా పీఎస్ డీఎస్పీ జయరాం ప్రసాద్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు, క్రైం డీఎస్పీ ఎస్ రాంబాబు, ఎస్సీ & ఎస్టీ సెల్ డీఎస్పీ బోను అప్పారావు, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎస్పీ వెంకట అప్పారావు, కాకినాడ సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ దొరరాజు ఉన్నారు.

## అనుమతులు లేని దుకాణాలపై చర్యలు

- రెండు దుకాణాలు సీజ్
- డిఎస్పీ ఎం.కిషోర్ కుమార్

**విశాలాంధ్ర - రాజానగరం :** ప్రభుత్వ అనుమతులులేకుండా దీపావళి మందుగుండు సామాన్లు అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని తూర్పు మండలి డిఎస్పీ ఎం.కిషోర్ కుమార్ అన్నారు. రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోనీ వివిధ దీపావళి సామాన్లు విక్రయించే దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.దీనిలో భాగంగా రాజానగరంలోని పలు దుకాణాలను పరిశీలించారు. షాపులు వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దుకాణ యజమానులతో చర్చించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తన పరిధిలోని తూర్పు, ఉత్తరం మండలి పోలీసు స్టేషన్ పరిధిలో సుమారు 120 దుకాణాలకు అనుమతులు ఉన్నాయనన్నారు. రాజానగరం లోని ఇద్దరు వ్యక్తులు అనుమతులు లేకుండా దీపావళి సామగ్రి విక్రయిస్తున్నట్లు గుర్తించామని,ఆ రెండు దుకాణాలు సిజ్ చేసినట్లు చెప్పారు.అలాగే స్థానిక క్వారీలో ఉన్న పేలుడు సామాగ్రిపై త్వరలోనే రికార్డులు తనిఖీలు చేస్తామని చెప్పారు. అనుమతులు, జాగ్రత్తలు తీసుకోకుండా క్వారీలో భారీగా బాంబులు పేల్చుతున్నా రని వస్తున్నవిమర్శలు పై స్పందించారు.పేలుడు పదార్థాలు ఎవరు అమ్ముతున్నారు, ఎన్ని ఉపయోగించారు తదితర అంశాలపై పూర్తిగా రికార్డులను పరిశీలిస్తామని తెలిపారు.ఆయన వెంట రాజానగరం సిఐ కాశీ విశ్వనాథం,ఎస్ఐ వై.సుధాకర్ సిబ్బంది ఉన్నారు.

## చంటి కుటుంబాన్ని పరామర్శించిన రమణారావు

**విశాలాంధ్ర - ఉప్పలగుప్తం :** ఉప్పలగుప్తం మండలం కిత్తనచెరువుకు చెందిన వైసిపి సీనియర్ నాయకుడు బళ్ళ చంటి ఇటీవల ఆకస్మిక మృతి చెందగా ఆ కుటుంబాన్ని శనివారం అమలాపురం నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు పరామర్శించారు. చంటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి చంటి భార్య గంగాభవాని, కుటుంబ సభ్యులకు రమణారావు ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో వైసిపి నాయకులు గంటా లక్ష్మీ ప్రసాద్, నేరేడుమిల్లి శ్రీను, కుంచే అర్జున్, పరమట రాజేష్, ములపర్తి శ్రీను, మెండు రమేష్, దేవరపల్లి నాని, పాము జనార్దన్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**విశాలాంధ్ర - రాజానగరం :** మండలంలోని జిఎస్ఎల్ ఆసుపత్రి వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బురిడీ వెంకట రమణ(62)అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి సంబంధించి రాజానగరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగంపేట మండలం ఎస్టి రాజాపూరం గ్రామానికి చెందిన వెంకట రమణ కొంతకాలంగా జిఎస్ఎల్ ఆసుపత్రిలో పనిచేస్తుందన్నారు. శనివారం ఉదయం విధులు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు దాటుతుండగా అదే సమయంలో రాజమహేంద్రవరం వైపు నుండి రాజానగరం వైపు వస్తున్న కారు జిఎస్ఎల్ వద్దకు వచ్చేసరికి తిరిగి రాజమహంద్రవరం వైపు వెళ్లేందుకు యు టర్న్ చేస్తున్న సమయంలో మహిళను ఢీకొనడం తో పాటు ఆమె మీదనుండి వెళ్లిపోవడంతో వెంకట రమణ అక్కడికిక్కడే మృతిచెందినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.ఈ మేరకు ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

## చంద్రమోహన్ మృతికి సంతాపం

**విశాలాంధ్ర-కొవ్వూరు :** సీనియర్ నటుడు చంద్రమోహన్ మృతి పట్ల వర్ధమాన సినీ నిర్మాత కొవ్వూరు మండలం వేములూరుకు చెందిన మరపట్ల కళాధర్ చక్రవర్తి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సినీ రంగం మరో మంచి నటుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆయన సరసన హీరోయిన్‌గా నటించిన ప్రతివారు నెంబర్ వన్ స్థానాల్లో ఉన్నారన్నారు. దీంతో చంద్రమోహన్ పక్కన నటించడానికి అవకాశాల కోసం ఎదురుచూసేవారని అన్నారు. అటువంటి నటుడు చనిపోవడం చాలా బాధాకరమని అన్నారు. చంద్రమోహన్ కుటుంబ సభ్యులకు తీవ్ర సానుభూతిని తెలిపారు.

## చిన్నారులకు దీపావళి బాణసంచా పంపిణీ

**విశాలాంధ్ర-పెరవలి :** దీపావళి అంటేనే పిల్లల పండుగని పిల్లల కళ్ళల్లో కనిపించే ఆనందమే దీపావళి సంబరాలని పెరవలి మండలం వశిష్ట వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సలాది ఉదయభాస్కర రావు అన్నారు.పెరవలి మండలం ముక్కామల గ్రామంలో ఆయన స్వగృహం వద్ద శనివారం దీపావళి పండుగ సందర్భంగా గ్రామంలోని చిన్నారులకు ఉచితంగా దీపావళి బాణసంచా పంపిణీ చేశారు.అనంతరం ఉదయభాస్కరరావు మాట్లాడుతూ దీపావళి పండుగ ప్రజలందరి జీవితాల్లో కష్టాలను తొలగించి వెలుగులు నింపాలని ఆకాంక్షించారు.ఈకార్యక్రమంలో సలాది వెంకట సౌభాగ్య లక్ష్మి పెరవలి మండలం లియో క్లబ్ ఫాస్ట్ ప్రెసిడెంట్ లు సలాది దుర్గాభారతి సలాది శ్రీరాజేశ్వరి లు పాల్గొన్నారు.

## ఓటర్ల పోలింగ్ బూత్‌లు తప్పుగా నమోదు

**విశాలాంధ్ర - పిఠాపురం :** స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మ అధ్యక్షతన ఆ పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గంలో స్థానిక వార్డులో ఓటర్లను వేరే పోలింగ్ బూతుల్లో మార్చి తప్పుగా జాబితాని తయారు చేశారని వర్మ అన్నారు. తప్పుగా తయారు చేసిన వాటర్ లిస్టను తక్షణమే సరిచేయాలని అధికారులు ఆయన కోరారు. ఓటరు లిస్టును సరిచేయునపక్షంలో ఎలక్షన్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానంద రెడ్డి, మడికి ప్రసాద్, సోమ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## ఆదిత్య కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం

**విశాలాంధ్ర - కాకినాడ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ , పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు, భారతదేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిపబ్లిక్ జింబాబ్వే, ఎడ్యుకేషన్ కౌన్సిలర్ ఎన్ క్యూబ్ లవ్ మోర్ విచ్చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆదిత్య డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి మాట్లాడుతూ అజ్ఞాన అంధకారాలను తొలగించి జ్ఞాన జ్యోతులు వెలిగించేది విద్యని అన్నారు. నూతన విద్యా విధానం విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడానికి ఉపయోగపడు తుందని తెలిపారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి ఆదేశాల మేరకు ఆదిత్య విద్యాసంస్థలలో ఈ విద్యా విధానం ముందు నుండి అమలులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు "జాతీయ విద్యా విధానం-2020" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో విజేతలకు ఎన్ క్యూబ్ లవ్ మోర్ ప్రశంసాపత్రాలను మరియు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ్ మూర్తి, ఏఎస్ఎంఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి రమేష్, ఏఐ డీన్ సిద్ధార్థ రెడ్డి, ఆదిత్య ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ డైరెక్టర్ పరంజీత్ సింగ్ ఎన్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, ఎల్ దివాకరరావు , విద్యార్థులు పాల్గొన్నారు.

## సంక్షేమంపై టీడీపీ చర్చకు సిద్ధమా!

**-తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సవాల్**

**విశాలాంధ్ర - కాకినాడ :** కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగని చందాన రూరల్ తెలుగుదేశం పార్టీ నాయకులు కొంతమంది సమావేశాలు సాగుతున్నాయని, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత జరిగిన సంక్షేమం,అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ సర్పంచ్, జెస్టీయూకె కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బెజవాడ సత్యనారాయణ సవాల్ చేసారు. తిమ్మాపురంలో ఆయన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి తన సుదీర్ఘ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల కష్టాలు, సమస్యలు నేరుగా చూసి అవి తీర్చాలనే ఉద్దేశ్యంతో నవరత్నాల పథకాలు ప్రవేశ పెట్టారని దేశంలో ఏరాష్ట్రంలోనైనా ముప్పై లక్షల పట్టాలు ఇచ్చిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చాలనే దృక్పథంతో దాదాపు 39 వేల కోట్ల ఖర్చు చేసి ప్రతీ పేదవాడికి సొంత ఇంటి కల జగన్ నెరవేర్చారన్నారు. రూరల్ నియోజక వర్గం ప్రెస్ మీట్లు పెడుతున్న తెలుగుదేశం నాయకులకు దమ్ము ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేసారు.

## దీపావళి సామగ్రి దుకాణాలకు అనుమతులు

**విశాలాంధ్ర - సీతానగరం:** మండల వ్యాప్తంగా 15 దీపావళి సామగ్రి దుకాణాలకు అనుమతులు మంజూరు అయ్యాయి. వీటిలో రఘుదేవపురం, సీతానగరం, మిర్తిపాడు గ్రామాల్లో 4, 10, 1 దుకాణాల చొప్పున అనుమతులు లభించాయి. ఈ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను అధికారులు పరిశీలించి ప్రభుత్వం విధించిన నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించే విధంగా చర్యలు తీసుకొని అధికారులు అనుమతులను జారీ చేశారు. శనివారం ఉదయం నుండి యజమానులు దుకాణాలను ఏర్పాటు చేసి దీపావళి సామగ్రి అమ్మకాలను ప్రారంభించారు. గ్రామాల్లో బంధువుల రాకతో దీపావళి పండుగ వాతావరణం నెలకొంది.

## రోటరీ మిడ్ టౌన్ సేవలు అభినందనీయం

**విశాలాంధ్ర - నిడదవోలు :** రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు మిడ్ టౌన్ సేవలు అభినందనీయ మని డిస్ట్రిక్ గవర్నర్ రావూరి సుబ్బారావు అన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్, రోటరీ ఇంటర్నేషనల్ 3020 గవర్నర్ రావూరి సుబ్బారావు క్లబ్బు అఫీషియల్ విజిట్‌లో భాగంగా నిడదవోలులో పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. రాచర్ల చైతన్ బాబు సహకారంతో తిమ్మరాజుపాలెం హృదయా లయనికి అవసరమైన వంట సామగ్రిని అందజేశారు. చాగల్లుజిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి ఇంటరాక్ట్ క్లబ్ ను ప్రారంభిం చారు. రొటేరియన్ గాలి రాఘవయ్య ఆర్థిక సహకారంతో దుప్పట్లు పంపిణీ చేసి, స్థానిక డిగ్రీ కళాశాల్లో స్టేజ్ ను, సీలింగ్ పనులను సంబంధించి శిలాఫలకాలు ప్రారంభించారు,సెయింట్ మార్టిన్ హెూమ్ లో వంటగదిని ప్రారంభించారు.అనంతరంరావిమెట్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ గవర్నర్ సుబ్బారావు (దత్త) మాట్లాడుతూ క్లబ్ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేయాలని పిలుపు ఇచ్చారు. క్లబ్ సమావేశం ఏర్పాటు చేసి రోటరీ ద్వారా చేయబోయే కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ గుంపుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ ఆకులరాజీవ్, ట్రెజరర్ తుమ్మెద సత్తిరాజు, గాలి రాఘవయ్య, పెచ్చెట్టి ఫణిసింహ,ఇంజె శేఖర్,గుబ్బల సత్యప్రసాద్, కృష్ణంరాజు, మీరావల్లి,చైతన్య బాబు, రాపాక వెంకట్ ఆనందంమురళి, ఎల్లే ప్రసాద్, కే.వెంకటేశ్వరరావు,గద్దె ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ

**విశాలాంధ్ర - ప్రత్తిపాడు:** నిరుపేద విద్యార్థులకు సదా మీ సేవలో స్వచ్ఛంద సేవ సంస్థ (ఎస్ఎంఎస్) అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత ప్రగతి సాధించాలని రిటైర్డ్ సీనియర్ వైద్యాధికారి ఏవి రమణ అన్నారు. ప్రత్తిపాడు బజారువీధి రామాలయం వద్ద శనివారం సదా మీ సేవలో సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ పౌష్టికాహార కిట్లను శ్రీషిర్డీ సాయి జ్యుయాలరీస్ అధినేత వడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చారు. వీటిని వైద్యాధికారి రమణ, ధనలక్ష్మి దంపతులు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు సలాది కృష్ణ, స్వర్ణపూడి వెంకట సోమేశ్వర రావు, జి సత్యానందం, శీరసాల మణికంఠ జ్యోతి, కె. జగదీశ్వరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# విశాలాంధ్ర గోదావరి జిల్లా

**కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ**

## లైసెన్సులు లేకుండా అమ్మకాలు చేస్తే చర్యలు

**విశాలాంధ్ర - జగ్గంపేట :** లైసెన్సులు లేకుండా బాణాసంచా అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటామని డిఎస్పీ బి.అప్పారావు హెచ్చరించారు. జగ్గంపేట పట్టణంలో రావులమ్మతల్లి అమ్మవారి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణా లను డిఎస్పి పరిశీలించారు. ప్రభుత్వా నికి చెల్లించాల్సిన జీఎస్టీ చెల్లించకపోవడంతో ఆర్డీవో లైసెన్సులను నిలుపుదల చేశారు. ఆర్డీవో నుండి లైసెన్సులను రాకుండా అమ్మకాలు చేస్తున్నారనే సమా చారంతో ఆ దుకాణాలను మూసి వేయించినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట జగ్గంపేట సిఐ బి.సూర్య అప్పారావు, జగ్గంపేట ఎస్ఐ నాగార్జున రాజు ఉన్నారు.

## ఏపీ నీడ్స్ కాదు ఏపీ హేట్స్ జగన్

**విశాలాంధ్ర - అనపర్తి :** నాలుగున్నర ఏళ్లలో రాష్ట్రంలో ఒక్కో కుటుంబం పై సుమారు 8 లక్షల అప్పుల అదనపు భారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మోపి రాష్ట్ర ప్రజలు కుదేలయ్యే పరిస్థితి తీసుకొచ్చారని రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విమర్శించారు. శని వారం జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధాకర్‌రెడ్డి స్థానిక కార్యాలయంలో నల్లమిల్లి మాట్లాడుతూ ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం హాస్యాస్పదంగా ఉందని ఏపీ హేట్స్ జగన్ అని ఆంధ్ర ప్రజానీకం అసహ్యించుకునే పరిస్థితి నేడు నెలకొందని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపు, డ్రగ్స్, గంజాయి, పెట్రోల్, డీజిల్, ఇసుక విధానం, అమ్మ ఒడి పై మాట్లాడుతూ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు విమర్శలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (దత్తుడు శ్రీను), జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు తమలంపూడి సుధాకర్ రెడ్డితదితరులు ఉన్నారు.

## మురుగునీటి పారుదలకు చర్యలు చేపట్టండి

**విశాలాంధ్ర- తాళ్ళపూడి :** యథారాజ తథ ప్రజ అన్నట్లు వుంది తాళ్ళపూడి పంచా యతీ పరిధిలోని మురుగు నీటి పారుదల సమస్య. ప్రక్కిలంక నటరాజ థియేటర్ ఎదురుగా గల తాళ్ళపూడి పంచాయతీ పరిధిలోని కంటి ఆసుపత్రి వీధిలో చాలాకాలం మురుగునీరు పారుదల లేక ప్రజలు, విద్యార్థులు నానా అగచాట్లు పడ్డారు. పడుతున్నారు. నీటి లోనే నడక సాగించారు. పంచాయతీ కార్యదర్శి ఆశా అలేఖ్య దృష్టికి వచ్చాక సమస్య పరిష్కారం కోసం చేపట్టిన చర్యలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చేపట్టిన చర్యలు అసంపూర్తి గానే మిగిలాయి. ఆ వీధిలో అండర్ గ్రౌండ్ డ్రైన్ ఉంది కాని వినియోగం లో లేదు. సమస్యగా మారిన మురుగు నీరు తరలించేందుకు నీరు పారుదల మార్గం దిశ మార్చారు తప్పా, ప్రయోజనం లేకపోయింది. మురుగు నీరు కాస్తా ఆర్ అండ్ బి రోడ్ మీదుగా మళ్ళి, పలువురికి ఇబ్బంది గా మారింది. మురుగు నీరు చేరి నాచు కట్టి దుర్గంధం వెద జల్లుతూ మురుగు గొయ్యి ఆ వీధి కే దిష్టి బొమ్మ లా తయా రయ్యింది. తరచు ప్రమాదాలు జరుగు తున్నాయి. వీధిలో ఉన్న మురుగు సమస్యను ఆర్ అండ్ బి రోడ్డు మీదకు తెచ్చారు. పరిష్కారమైతే కాలేదని కాని రోడ్ గోతులు పడిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

**విశాలాంధ్ర - రాజానగరం :** మండలంలోని జీఎస్ఎల్ హాస్పటల్ వద్ద జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబటి సుబ్బారావు(74) అనే వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన అంబటి సుబ్బారావు గుండె పరీక్షల నిమిత్తం స్థానిక ఓ ప్రైవేట్ ఆసుపత్రికి వస్తుండగా సుబ్బారావు వెనుక నుంచి వచ్చిన ఐషర్ వ్యాను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.చికిత్స నిమిత్తం క్షతగాత్రుడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడని పోలీసులు తెలిపారు.మృతుని కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## ఏళ్ల తరబడి వేధిస్తున్న చెత్త సమస్య

**విశాలాంధ్ర - ముమ్మిడివరం :** ముమ్మిడివరం కొత్తలంక రోడ్డులో మార్కెట్ సమీపంలో ఏళ్ల తరబడి చెత్త సమస్య వేధిస్తుంది. చెత్తను రోడ్డు మీద పాడేసి చెత్తకు నిప్పు పెట్టడంతో పాటు అనేక వ్యర్థాలు పడేయడంతో వాయు కాలుష్యంతో అనారోగ్య సమస్యలకు గురవుతున్నా మని డంపింగ్ యార్డ్‌కు స్థలం సేకరణ ప్రతిపాదనలకే పరిమితమైందని తక్షణమే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు స్పందించాలని స్థానికులు, ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


**ప్రకటన**

నా క్లయింటు పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం, యానాం, అప్పం గార్డెన్స్, డో.నెం. 4-7080 కాపురస్తురాలు శ్రీ కోటిపల్లి రఘురాముడు గారి భార్య శ్రీమతి కోటిపల్లి వీరవెంకట రాజేశ్వరి గారు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

షెడ్యూలు దాఖలో ఐటమ్ నెం. 2 సర్వే నెంబరులో గల ఆస్తి పూర్వం కొమ్మిరెడ్డి వెంకటరెడ్డి గారికి చెందినదనియు, వారి తదనంతరం సదరాస్తి వారి కుమారులు 1) కొమ్మిరెడ్డి ఆది వెంకట రమణ, 2) కొమ్మిరెడ్డి వెంకట వరప్రసాద్ లకు దఖలుపడిన ఆస్తిని వారు ది. 29-08-2001వ తేదీగల విభాగాపు దస్తావేజు (Doc. No. 312/2001) ద్వారా పంచుకొనగా 639.36 చ.మీలు ఆస్తి కొమ్మిరెడ్డి వీర వెంకట వరప్రసాద్ గారి వాటాకు రాబడి. తదుపరి సదరాస్తిని ముదునూరి రామకృష్ణం రాజు గారు ది.16-09-2002 తేదీగల క్రియ దస్తావేజు (Doc. No.315/2002 in SRO, Yanam) ద్వారా క్రయం పొందిన ఆస్తిని మరియు ఇదే విధంగా ముదునూరి రామకృష్ణం రాజు గారు ... ది. 09-10-2002వ తేదీగల క్రియ దస్తావేజు (Doc. No. 340/2002) క్రయం పొందిన ఐటమ్ నెం. 1 సర్వే నెంబరులో గల H.00-A.14-ca.18 ఆస్తిని తన సోదరుడైన ముదునూరి వెంకట సత్య సూర్యనారాయణ రాజా గారికి ది. 30-03-2005 తేదీగల సెటిల్‌మెంట్ దస్తావేజు (Doc. No. 142/2005 in SRO, Yanam) ద్వారా దఖలు పడిందనియు. సదరు ముదునూరి వెంకట సత్య సూర్యనారాయణ రాజా గారి తరపున పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ అయినటువంటి పబ్బిసెట్టి వీరభద్రరావు గారు శ్రీమతి పబ్బిసెట్టి సుబ్బలక్ష్మి గారికి ఐటమ్ నం. 1 సర్వే నంబరు తాలూకా 220 చ.మీలు మరియు ఐటమ్ నెం. 2 సర్వే నెంబరు తాలూకా 206 చ.మీలు, తేదీ 25-04-2008 తేదీగల క్రియ దస్తావేజు (Doc. No. 209/2008 in SRO, Yanam) ద్వారా క్రయపరిచిన ఆస్తి అయి ఉన్నదనియు. సదరు పబ్బిసెట్టి సుబ్బలక్ష్మి గారి తరపున వారి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోల్డర్ పబ్బిసెట్టి వీరభద్రరావు గారి నుండి నా క్లయింటు ఐటమ్ నెం. 1 సర్వే నెంబరు తాలూకా 122 చ.మీలు మరియు ఐటమ్ నెం. 2 సర్వే నెంబరు తాలూకా 97 చ.మీలు వెరశి 219 చ.మీలు ఖాళీ నివేశ స్థలము ది. 13-06-2014 (Doc. No. 462/2014 in SRO, Yanam) క్రయం పొందిన ఆస్తి ... సదరాస్తిపై ఎటువంటి పేచీలు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు లావాదేవీలు పెండింగ్‌లో లేవని ... నా క్లయింటు ఒక జాతీయ బ్యాంకుతో షెడ్యూలు ఆస్తిని కుదువ పెట్టి ఋణము తీసుకొనుటకు ప్రయత్నించుచున్నారు. కనుక ఈ ప్రకటన ద్వారా సదరాస్తిపై యావత్తు క్రయములు, ఇతర ఉన్న కోర్టు పేచీలు, తనఖా భాగభరణ వగైరా లావాదేవీలు ఏమైనా ఉన్న యెడల, వేరెవ్వరికైనా హక్కులు ఉన్న యెడల అవి అన్నియు ఈ ప్రకటన తేదీ నుండి 10 రోజులలోపు ఈ క్రింద ఉదహరించిన చిరునామాకు తగిన ఆధారములతో తెలియచేయవలెను. లేని యెడల పై విషయములు అన్నియు యథార్థములుగా భావించి, ధృడపరచుకుని, నా క్లయింటుకు మాత్రమే సదరాస్తిపై పూర్తి హక్కులు కలవని భావించి ... గడువు దాటిన పిదప వచ్చు ఆక్షేపణలు, అభ్యంతరములు మరియు తగిన ఆధారములు లేకుండా పంపిన అభ్యంతరములు పరిగణింపబడవని గమనించగలరు.

**క్రయాస్తి షెడ్యూలు:** పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతం, యానాం సబ్-రిజిస్ట్రారు ఏలుబడిలో చేరిన, యానాం, కనకాలపేట గ్రామం తాలూకా ఖాళీ నివేశ స్థలం.

**ఐటమ్ నెం. 1 :** T.S. No. C/7/13/1Bpt, R.S. No. 50/1pt, C.S. No. 159/2ptలో గల 122 చ.మీలు.

**ఐటమ్ నెం. 2 :** T.S. No. C/7/13/4Bpt, R.S. No. 50/4pt, C.S. No. 159/1/1ptలో గల 97 చ.మీలు వెరశి మొత్తం 219 చ.మీలు ఖాళీ నివేశ స్థలం.

**ఐటమ్ నెం. 1 :** 122 చ.మీలకు కొలతలు మరియు హద్దులు: తూర్పు: 11.00 మీ. - ఐటమ్ నెం. 2 షెడ్యూల్ ఆస్తి; పడమర: 11.00 మీ. - ... వారి ఆస్తి; ఉత్తరం: 11.20 మీ. - శ్రీమతి పెద్దిరెడ్డి సత్యలక్ష్మి గారి ఆస్తి; దక్షిణం: 11.00 మీ. - ఈ సర్వే నెంబరు తాలూకా శ్రీ తలింగమల్లై గారి 109 చ.మీల ఆస్తి.

**ఐటమ్ నెం. 2 :** 97 చ.మీలకు కొలతలు మరియు హద్దులు: తూర్పు: 11.00 మీ. - NH - 214 రోడ్డు; పడమర: 11.00 మీ. - ఐటమ్ నెం. 1 షెడ్యూల్ ఆస్తి; ఉత్తరం: 7.00 మీ. - శ్రీమతి పెద్దిరెడ్డి సత్యలక్ష్మి గారి ఆస్తి; దక్షిణం: 10.60 మీ. - ఈ సర్వే నెంబరు తాలూకు శ్రీ తలింగమల్లై గారి 109 చ.మీల ఆస్తి.

సదరు కొలతలు, హద్దులు మధ్యస్థమైన 1) 122 చ.మీ. మరియు 2) 97 చ.మీ. మొత్తం ఆస్తి 219 చ.మీలు ఖాళీ నివేశ స్థలం ... రివాజా పడకల దారి మార్గములు, ఈజిమెంటు హక్కులతో సర్వం సహా.

**మాజేటి నటరాజన్,** అడ్వకేట్
డో.నెం. 7-01-50, పైడికొండల వీధి,
యానాం - 533464. సెల్: 9866189003

యానాం
ది.11-11-2023

## దళిత ఉద్యోగుల సంక్షేమం, అభివృద్ధే మేడ్ లక్ష్యం

**విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం రూరల్:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళిత ఉద్యోగుల సంక్షేమం అభివృద్ధే మేడ్ లక్ష్యం అని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ అన్నారు. శనివారం స్థానిక హంగ్రీ బడ్స్ హొటల్ లో మోడల్ అసోసియేట్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్ జిల్లా సమావేశం కండెల్లి వెంకట్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులందరూ ఐక్యత కలిగి ఉండాలన్నారు. ఐక్యతతోనే సమాజంనుంచి ఎదురవుతున్న వివక్షతను ఎదుర్కోవడంతోపాటు సమస్యలు కూడా పరిష్కారం అవుతాయన్నారు. ఆర్థికంగా స్థిరపడిన దళిత ఉద్యోగులు తోటి నిరుద్యోగులకు, ఉన్నత చదువులు చదివే వారికి తమ వంతు మానవతా దృక్పదంతో సహకరించాలని కోరారు. మేడ్ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని. వాటిని గత 5 సంవత్సరాలుగా పరిష్కరించి వారికి దిక్సూచిగా మేడ్ పనిచేస్తుందన్నారు. డాక్టర్ బి. ఆర్. అంభేద్కర్ భావజాలంతో ఉద్యోగులందరూ పే బ్యాక్ టు సొసైటీ నినాదంతో ముందుకు రావాలని సూచించారు. అనంతరం నూతన జిల్లా కమిటీని నియమించారు. మేడ్ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులుగా కండెల్లి వెంకట్ ప్రధాన కార్యదర్శిగా ముప్పిడి లిల్లీ గ్రేస్ ను నియమించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం మేడ్ అధ్యక్షులుగా గెద్దం వినోద్, ప్రధాన కార్యదర్శిగా కొడవటి వెంకటేష్ లను నియమించారు. తణుకు మేడ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సి.హెచ్. ప్రియాంక, ఏడిద వెంకట్రావు, భీమవరం మేడ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కడిమి అరుణ్ కుమార్, పి.రత్నాకర్, నరసాపురం మేడ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా నవరపు వెంకటేశ్వరారవు, గెద్దం షాలేమ్ రాజు, ఆచంట నుండి కాకినాడ లిల్లి, పాలకొల్లు కండెల్లి శ్రీనివాస్లను నియమించారు. ఈ కార్యక్రమంలో మేడ్ నాయకులు రాజ్యలక్ష్మి, బి. రాజారావు, కె. రాజారత్నం, వి. శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

**విశాలాంధ్ర-జీలుగుమిల్లి :** అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న మొగ్గ రామారావును అరెస్టు చేసినట్టు జీలుగుమిల్లి సిఐ బి. వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం జీలుగుమిల్లి పోలీస్స్టేషన్లో మాట్లాడుతూ గత సంవత్సరం గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరు పట్టుబడగా మూడవ వ్యక్తి విశాఖపట్నంకి చెందిన మొగ్గ రామారావుని శుక్రవారం రాత్రి తాటి ఆకులగూడెం కనకదుర్గమ్మ గుడి వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎస్ఐ వి.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మికుల భద్రత ప్రభుత్వ బాధ్యత

**విశాలాంధ్ర - వేలేరుపాడు :** వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రత విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మడివి దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో కన్నం నరసమ్మ అధ్యక్షతన శనివారం మిడ్ డే మీల్స్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడ్ డే మీల్స్ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించు కోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలతో ఎన్నో ఏళ్లుగా వెట్టి చాకిరి చేయించుకుంటున్న ప్రభుత్వాలకు వారి కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత లేదాని ప్రశ్నించారు. వైయస్సార్ కాంగ్రెస్ అధికారం చేపట్టినప్పటి నుండి వారికి వేతనాలు పెంచిన దాఖలాలు లేవన్నారు. సరైన వసతులు కల్పించకుండా మెనూలు పెంచి ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వేతనం పెంచడం, హెల్త్ ఇన్సూరెన్స్, డ్రెస్ కోడ్ తదితర వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. ఈనెల 15 వ తేదిన జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మిడ్ డే మిల్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కే. రంగమ్మ, కె నరసమ్మ, అంగన్వాడీ సంఘం జిల్లా కార్యదర్శి సువ్వేటి లత, సీతారామమ్మ, వెంకమ్మ, దేవి, శాంతి, పార్వతి, నయేమి తదితరులు పాల్గొన్నారు.

## దీపంలో మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం

**విశాలాంధ్ర -భీమవరం:** భీమవరం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తు గ్యారంటీ పథకాల లబ్దిదారుల నమోదు కార్యక్రమాన్ని భీమవరంలో శనివారం పట్టణం 24వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మీ మాట్లాడుతూ 2024 ఎన్నికలలో తెదేపా జనసేన సంయుక్త పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే భవిష్యత్తు గ్యారెంటీలోని వాగ్దానాలను అమలు చేయడంతోపాటు రాష్ట్ర అభివృద్ధికి పురోగతికి సమన్వయంతో పరస్పర సహకారంతో సమిష్టి కృషితో అన్ని సంక్షేమ పథకాలను అమలుచేస్తూ దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మెంటే గోపి, ఎద్దు యేసుపాదం, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, మాదాసు కనకదుర్గ, పాపోలు ఏడుకొండలు, నేదునూరి గంగాధర్, దొంగ వెంకటేశ్వరరావు, బండి రాజేష్, మండవల్లి ఈశ్వర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థకు ఆద్యులు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్

**విశాలాంధ్ర-భీమడోలు:** విద్యా వ్యవస్థకు ఆద్యుడు మౌలానా అబుల్ కలామ్ అజాద్ సేవలు చిరస్మరణీయని భీమడోలు జడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయం శనివారం భారత రత్న, తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలామ్ అజాద్ 136వ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల వాల్ పోస్టర్స్, కరపత్రాలను ఆమె ఆవిష్కరణ చేశారు. తొలుతా అజాద్ చిత్ర పటానికి పలువులు మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. విద్యా వ్యాప్తికి అయన చేసిన సేవలను నేటి తరం స్పూర్తిని పొందాలన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జరిగే జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి పాఠశాల విద్యార్థులు పోటీలలో పాల్గొని విజయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చైతన్య యువజన సంఘం జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ పాము మాన్ సింగ్,అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ తుమ్మల ఉమామహేశ్వరరావు, లైబ్రరీ గౌరవ అధ్యక్షులు రామకుర్తి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు మద్దాల అప్పారావు, లైబ్రరియన్ కె. శ్రీనివాస్,సిబ్బంది,పెద్దలు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషిచేసిన అబుల్ కలాం అజాద్

**విశాలాంధ్ర - కొయ్యలగూడెం :** విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం అజాద్ ఎనలేని కృషి చేశారని గ్రంథ పాలకురాలు యు రాముడు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకురాలు యు. రాముడు ఆధ్వర్యంలో భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతొ ఆమె మాట్లాడుతూ అబుల్ కలాం ఆజాద్ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా విద్య అభివృద్ధికి ఎంతో గొప్ప కృషి చేసినవ్యక్తి అన్నారు. భారతదేశ స్వాతంత్ర పోరాటంలో ఆయన పాల్గొన్నారని , ఆయనకు భారతరత్న అవార్డు కూడా ప్రకటించడం జరిగిందని ఆమె విద్యార్థులకు సూచించారు. ముందుగా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, పాల్గొన్నారు.

## అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు

**విశాలాంధ్ర-ఏలూరు:** స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఏలూరు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి యం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఆయన జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని డిఆర్వో యం. వెంకటేశ్వర్లు సూచించారు. మౌలానా అబుల్ కలాం అజాద్ విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మకమైనటువంటి మార్పులు తీసుకువచ్చారన్నారు. మైనారిటీ విద్యా, వెనుకబడిన వర్గాల వారీ విద్యకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. వారు విద్యారంగంలో తీసుకువచ్చిన మార్పులు భవిష్యత్ తరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. అటువంటి మౌలానా అబుల్ కలాం ను స్ఫూర్తిగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎస్.ఎస్. కృపావరం, కలెక్టరేట్ ఏవో ఎస్. రమాదేవి, కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు చల్లన్న దొర, యండి షా, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి జగన్ నియంత పాలన

**విశాలాంధ్ర-ఆకివీడు :** ముఖ్యమంత్రి జగన్ పాలన నియంత పాలన కొనసాగిస్తున్నారని,రాష్ట్ర భవిష్యత్తు మార్చే సత్తా ఉన్న నాయకుడు చంద్రబాబు మాత్రమే అని ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు అన్నారు. శనివారం ఆకివీడు మండలం చెరుకుమిల్లి గ్రామంలో బాబుతో నేను, ఇంటింటికి రాంబాబు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు ఇంటింటికి తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలోని సమస్యలను ఎలుగెత్తి చూపుతూ వైసిపి ప్రభుత్వాన్ని ఎండగట్టాలన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ బొర్రా సుజాత ఇంటి వద్ద ఎమ్మెల్యే ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలిదిండి నగేష్ రాజు, గంధం ఉమా, నౌకట్ల రామారావు, బొచ్చు సరళ కుమారి, కిమిడి అరుణకుమారి, శ్యామల ,బొర్రా రాంబాబు, నరేష్, దోబ సురేష్ తోపాటు టిడిపి శ్రేణులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**విశాలాంధ్ర-నూజివీడు :** ముఖ్యమంత్రి జగన్ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషద్ కార్యాలయంలో శనివారం విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో డివిజనల్ స్థాయి సమీక్షా సామావేశం డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ నిర్వహించి పలు సూచనలు చేసారు. సందర్బంగా డీపీఓ శ్రీనివాస మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ ఈ నెల 17న పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి జిల్లాకు రానున్న సందర్బంగా పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ కార్యదరులు, విస్తరణ అధికారులతో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. హెలిప్యాడ్, ఎం.ఐ.జి లేఔట్, వాహనాలు పార్కింగ్ ప్రాంతాలలో ముఖ్యంగా హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ ప్రాంగణం రోడ్డు మార్గంలో ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు జరగాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడానికి 450 మంది కార్మికుల సేవలను, 200 మంది పంచాయతీ కార్మికులను వినియోగించునున్నామని విస్తరణ అధికారుల ఆధ్వర్యంలో జరుగు పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలను డివిజనల్ పంచాయతీ అధికారులు పర్యవేక్షణ చేయనున్నారని, విది నిర్వహణలో సిబ్బంది అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని సమావేశంలో డీపీఓ శ్రీనివాస విశ్వనాథ్ హెచ్చరించారు. కార్యక్రమంలో కమీషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి తదితరులు పాల్గొన్నారు.

## వెల్ఫేర్ అసిస్టెంట్ కుటుంబానికి వైసీపీ వితరణ

**విశాలాంధ్ర -భీమవరం టౌన్ :** భీమవరం మండలం ఎల్ వి ఎన్ పురం గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న జక్కం కుమార్ సాయి సుహాస్ ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి వైసిపి నాయకులు ముందుకు వచ్చారు. రూ.1లక్ష 50 వేలు సేకరించి స్థానిక క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ చేతుల మీదుగా ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు తమ ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉందని అన్నారు. భవిష్యత్తులో కూడా సుహాస్ కుటుంబానికి తమ సహకారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎంపీడీవో వెంకటలక్ష్మి, దిరుసుమర్రు గ్రామ సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, గొల్లవాని తిప్ప సర్పంచ్ చిల్లే వెంకటేష్, మాజీ సర్పంచ్ గొట్టుముక్కల సత్యనారాయణ రాజు (ధర్మరాజు) తిరుమాని ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## జిన్నూరు శాఖా గ్రంథాలయంలో14 నుండి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

**విశాలాంధ్ర-పోడూరు :** మండలంలోని జిన్నూరులో శ్రీ సీతారామరాజు విజ్ఞాన ప్రభా శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుండి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుపనున్నట్లు గ్రంథాలయ పాలకురాలు బత్తుల జోగారత్నం, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దండు కృష్ణంరాజు తెలిపారు. ఈనెల 14న గ్రామ సర్పంచ్ జమ్ము బేబీ మహాలక్ష్మి జాతీయ పతాకావిష్కరణ చేస్తారని,కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షులు డిటిడిసి బాబు గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభిస్తారన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు సీనియర్, జూనియర్ విద్యార్థులకు, మహిళలకు వివిధ విజ్ఞాన వినోద పోటీలు నిర్వహించనున్నట్టు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సహాయ కార్యదర్శి తాళాబత్తుల వెంకటేశ్వరరావు తెలిపారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు ఈనెల 20న జ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

## అక్రమ మద్యం పట్టివేత

**విశాలాంధ్ర -నూజివీడు:** ఏలూరు జిల్లా ఎస్పీ డి. మేరీ ప్రశాంతి ఆదేశాలపై ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ఎన్. సూరి చంద్రరావు ఆధ్వర్యంలో ఎస్. ఇ.బి టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ కృష్ణ ధన రాజుకు అందిన సమాచారం మేరకు నూజివీడు ఎస్.ఇ.బి ఇన్స్పెక్టర్ గోపాల్ కృష్ణ, ఎస్ఐ అల్లురయ్య, హెడ్ కానిస్టేబుల్ కేవివి సత్యనారాయణ, ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, సింగలతో కలిసి చాట్రాయి మండలం కృష్ణారావు పాలెం చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా పామర్తి గోపాలకృష్ణ వద్ద సుమారు 100 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని విచారించగా అతను ఇచ్చిన సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం యానాంతు చెందిన 97 ఫుల్ బాటిళ్లను, 706 క్వార్టర్ బాటిల్ మొత్తం 803 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నూజివీడు ఎస్.ఇ.బి పోలీస్ స్టేషన్‌లో కేసును నమోదు చేసినట్లుగా ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ తెలియజేశారు.

## ఆదిత్యలో రసవత్తరంగా కబడ్డీ పోటీలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం: ఆదిత్య విద్య ప్రాంగణంలో నిన్నటి నుంచి జరుగుతున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ(పురుషులు) టోర్నమెంట్ 2023 పోటీలు హెరారా హెరాలీగా ఆద్యంతం రసవత్తరంగా సాగుతున్నాయి. నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలలో మూడవ రోజు వివిధ టీమ్‌ల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. నిన్న రాత్రి 10-00 గంటల వరకు జరిగిన పోటీలు శనివారం ఉదయం 7-00 గంటల నుండి ప్రారంభమయ్యాయి. ఈ రోజు టీమ్‌ల పరిచయ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్‌పి, బి సత్యనారాయణ, ఆదిత్య క్యాంపస్ డైరెక్టర్ డా ఎం శ్రీనివాస రెడ్డి, బెంగుళూరుకు చెందిన ఐఐఎస్‌సి ప్రొఫెసర్ డా ఎస్‌సి శివప్రకాష్, పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్స్ డాక్టర్ డోలా సంజయ్, డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ వివిధ విభాగాల డీన్లు ఆదిత్య ఫిజికల్ విభాగాధిపతి జివి ప్రతాప్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

## భూమి, భుక్తి కోసం 8 వేల మంది అశువులు

**విశాలాంధ్ర - జగ్గంపేట :** భూమి, భుక్తి పీడిత ప్రజల విముక్తి కోసం 8 వేల మంది బూటకపు ఎన్ కౌంటర్లలో అశువులు బాసారని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. జగ్గంపేట పంచాయతీ రాజ్ అతిథి గృహం వద్ద రంగవల్లి అక్క వర్ధంతి వేడుకలు శనివారం రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత జగ్గంపేట పట్టణంలో రైతు కూలీ సంఘం కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నవంబర్ మాసంలో అనేకమంది అశువులు బాసారని, వారందరికీ నివాళులు అర్పిస్తూ ఈ నెల అంతా వర్ధంతి సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండా దుర్గారావు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు వల్లూరి రాజబాబు, జిల్లా కార్యదర్శి బి. రమేష్, కె. సతీష్ తదితర రైతు కూలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ధన్వంతరీ జయంతి

**విశాలాంధ్ర - మండపేట :** ధన్వంతరీ జయంతి వేడుక ది పీఎంపీ అసోసియేషన్ మండపేట మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగింది. అసోసియేషన్ టౌన్ అధ్యక్షుడు కోన సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక ఉషా క్లినిక్ వద్ద ధన్వంతరి జయంతి సందర్బంగా ధన్వంతరి చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ సకల జీవుల ఆరోగ్యాన్ని కాపాడటం కోసం శ్రీ మహావిష్ణువే ధన్వంతరి అవతారమెత్తి పశుపక్ష్యాదులకు, ప్రజలకు వైద్యం అందించేవారన్నారు. ధన్వంతరి అనే పేరును పురాణాల ప్రకారం నాలుగు విధాలుగా పిలుస్తారన్నారు. భాగవతంలో క్షీర సాగర మథన సమయంలో అమృత కలశాన్ని చేత పట్టుకుని అవతరించిన శ్రీమహావిష్ణువే ధన్వంతరీ అన్నారు. వైద్య వృత్తిని నమ్ముకుని జీవించే వారంతా ధన్వంతరీని ఆరాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బల్లా వెంకటరమణ, కోశాధికారి వానపల్లి కనకరాజు, సభ్యులు మానేపల్లి శ్రీనివాస్, పిల్లా సతీష్, నరేష్, మణికంఠ, చిన్నారావు, వీరబాబు, సురేష్, ఏడుకొండలు, అవినాష్, సురేష్, కోశాధికారి, చంద్రశేఖర్, నరేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ

**విశాలాంధ్ర - తాళ్ళపూడి :** తాళ్ళపూడి మండలం లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి టీడీపీ నాయకులు మండలంలోని పెద్దేవం గ్రామం లో శ్రీకారం చుట్టారు. పెద్దేవం టీడీపి గ్రామ కమిటీ అధ్యక్షుడు కోడి శంకరం ఆధ్వర్యంలో టీడీపీ సీనియర్ నాయకులు బోడపాటి కాశి, కొవ్వూరు నియోజకవర్గం ఎస్సీ సెల్ నాయకులు తిగిరిపల్లి గోపి, జమ్ముల నరేంద్ర, బూత్ ఇన్‌చార్జి శ్రీను, బూత్ ఇన్‌చార్జి ముప్పిడి రాజేశ్, ముప్పిడి వెంకటరత్నం, పసల పూడి రాజేంద్ర, మణికంఠ, బుల్లి రాజు ,తదితరులు పాల్గొన్నారు. ఓటర్లిస్ట్ పరిశీలన తో పాటు, ప్రతి ఇంటికి బాబు అధికారం లోకి రావాలన్న ఆకాంక్షను తెలుపుతూ ప్రచార కార్యక్రమాన్ని సాగించారు.

## కిటకిటలాడిన వెంకన్న ఆలయం

**విశాలాంధ్ర-పెరవలి:** మండలంలోని అన్నవరప్పాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీఅలిమేలు మంగా పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవాదాయ శాఖ ఉప కమిషనర్ ఎం. విజయరాజు ఆలయానికి వచ్చి స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయంలో ఇటీవల జరిగిన అభివృద్ధి పనులు చూసి ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కానూరు గ్రామానికి చెందిన అనపర్తి హేమంత్ శ్రీ సూర్య నితీష దంపతుల ఆర్థిక సహాయంతో సుమారు 3,500 మందికి అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కొద్దిమంది భక్తులు బియ్యం చిల్లర నాణాలతో తులాభారాలు జరుపుకొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

## డిసెంబరు10న కార్తీక వనసమారాధన

**విశాలాంధ్ర - అనపర్తి :** కార్తీక మాసం పురస్కరించుకొని డిసెంబర్ 10 న రెడ్డి కార్తీక వన సమారాధన ఏర్పాటు చేయనున్నట్లు కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాధ్ రెడ్డి తెలిపారు. శనివారం అనపర్తిలో కార్తీక సమారాధన ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోస్తాంధ్ర రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కర్రి త్రినాధ్ రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్థానిక జిబిఆర్ విద్యాసంస్థల సమీపంలోని దుప్పలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంతంలోని నేషనల్ వెంకటరెడ్డి మామిడి తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు అనేక సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలతో పాటు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించినట్లు త్రినాధ్ రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్తి వీర్రెడ్డి, కోస్తాంధ్ర యూత్ విభాగ అధ్యక్షులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, రెడ్డి సంఘం ప్రతినిధులు వెలగల విజయ ఆదిత్య రెడ్డి, ఎస్ వి రాఘవరెడ్డి (రావులపాలెం), గొలుగూరి సత్యనారాయణ రెడ్డి (రాజమహేంద్రవరం), ఎస్‌వి కృష్ణారెడ్డి (కాకినాడ), సుబ్బారెడ్డి (పసలపూడి) తదితరులు ఉన్నారు.

## జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి

**విశాలాంధ్ర-దేవరపల్లి:** రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీకి అఖండ విజయం చేకూర్చి తిరిగి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావటానికి ప్రతి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని దేవరపల్లి ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. దేవరపల్లిలో ఎంపీపీ దుర్గారావు స్వగృహం వద్ద వైసీపీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ గత నాలుగున్నర సంవత్స రాల నుండి రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు వేగవంతంగా తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ముఖ్యంగా బీసీ ఎస్సీ ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ సమావేశంలో దేవరపల్లి మండల వైసీపీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్ దేవరపల్లి వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు వైసీపీ నేతలు దుగ్గిన గంగాధరరావు కుసులూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభం కూలి వృద్ధురాలికి గాయాలు

**విశాలాంధ్ర - యు కొత్తపల్లి :** నాగులపల్లి గ్రామంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ స్తంభం శనివారం వృద్ధురాలి కాలుపైపడడంతో తీవ్ర గాయంమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం నాగులపల్లి గ్రామంలో విద్యుత్ స్తంభం పడిపోయేలా ఉందని విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోకపోవడంతో విద్యుత్ స్తంభం వృద్ధురాలైన చింతపల్లి సూర్య చక్రం (65)పై పడడంతో ఆమె తీవ్ర గాయాల పాలైంది. ఆమెను వైద్యం కోసం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. నిర్లక్ష్యం వహించిన విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి, నారాయణరెడ్డి, జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

## అగ్ని బాధితులకు రెడ్‌క్రాస్ ఆపన్నహస్తం

**విశాలాంధ్ర - అయినవిల్లి :** కొండుకుదురులో అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయిన కుటుంబానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఆపన్న హస్తం అందించింది. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కోరుకొండ సత్యనారా యణ(ఢిల్లీ నారాయణ) సూచనలు, జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా ఆదేశాల మేరకు శనివారం ఆ గ్రామ సర్పంచ్ మేడిద దుర్గాప్రసాద్ చేతుల మీదుగా వంట సామాగ్రి, టార్పాలిన్, హైజానిక్ కిట్స్, బియ్యం, కూరగాయలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు ఒరిగిట బాలరాజు, రత్న ప్రసాద్, విఆర్ఓ డి.భవాని తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత జగన్‌కే

**విశాలాంధ్ర - కిర్లంపూడి :** రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దక్కుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు అన్నారు. కిర్లంపూడి మండలం భూపాలపట్నం గ్రామంలో బాబు షూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మహాశక్తి చైతన్య రథయాత్ర కార్యక్రమం రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ ఆదేశాలతో క్లస్టర్ ఇంచార్జ్, జగ్గంపేట నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు, భూపాలపట్నం సర్పంచ్ వీరం రెడ్డి కాశి బాబు ఆధ్వర్యంలో మహిళా శక్తి కమిటీ, ఎస్వీఎస్ అప్పలరాజు, కంచుమర్తి రాఘవ హాజరై గ్రామంలో మహిళలతో కలసి ఇంటింటికీ తిరిగి మహాశక్తి పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎస్వీఎస్ అప్పలరాజు మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా జగన్ నెరవేర్చక పోగా మద్యపాన నిషేధం చేస్తానని చెప్పి యువతకు ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాట మార్చాడని, ఏ ప్రభుత్వం వచ్చినా మద్యనిషేధం చేయకుండా 25 సంవత్సరాలు మద్యం పాలసీ తాకట్టుపెట్టి 25 వేల కోట్లు అప్పు చేసిన ఘనత ఈ జగన్ రెడ్డికే చెందుతుందన్నారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు ఆగాలన్న మహిళలు ఆర్థికంగా,సామాజికంగా పురోభివృద్ధి సాధించాలన్న తెలుగుదేశంపార్టీ అధికారంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోడే బాల, సూరిశెట్టి వెంకట శివ, గుడాల చిట్టిబాబు, బీసెట్టి సూరిబాబు, త్రిమూర్తులు, బుర్రి శ్రీను,గ్రామ టిడిపి అధ్యక్షులు గొంతిన బాబ్జి, మహిళా శక్తి కమిటీ సభ్యులు, మహిళా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆజాద్ జయంతి

**విశాలాంధ్ర - కాకినాడ రూరల్ :** భారతరత్న, స్వాతంత్ర సమరయోధుడు, మాజీ కేంద్ర విద్యా శాఖ మంత్రి, విద్యావేత్త, మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం విద్యా దినోత్సవం జయంతి ఉత్సవాలను ఘనంగా కాకినాడ రూరల్ వైసిపి పార్టీ కార్యాలయంలో కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కురసాల కన్నబాబు మాట్లాడుతూ భారతదేశ విభజనను పూర్తిగా వ్యతిరేకించిన మహోన్నత దేశభక్తుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఖరగ్పూర్ ఐఐటి, యుజిసి గ్రాంట్ కమిషన్ నెలకొల్పి విద్య అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేయడం జరిగిందని అలాగే అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మైనారిటీ సంక్షేమ దినం, జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించబడిందన్నారు. ఆజాద్ పార్సి, హిందీ, ఇంగ్లీష్, గణితం, లలో గొప్ప మేధావి అని కొనియాడారు. మన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మైనారిటీలకు పెద్ద పీట వేస్తూ విద్య నిమిత్తం అన్ని వర్గాల వారికి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అందులో భాగంగా అమ్మ ఒడి, విద్యా దీవెన ,విద్యా కానుక, వసతి దీవెన, విదేశీ విద్య, ఫీజు రియంబర్స్మెంట్, ఇలాంటి ఎన్నో కార్యక్రమాలను చేస్తున్నారని వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నూరుకుర్తి రామకృష్ణ, రెహమాన్ ఖాన్, కరీం బాషా, నేమాం సర్పంచ్ రామదేవ్ సూర్యప్రకాశరావు, వైసీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున అబ్దుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## జగన్ పాలనలో పెరిగిన నిత్యావసర ధరలు

**విశాలాంధ్ర - యు కొత్తపల్లి :** జగన్ పాలనలోనిత్యవసర వస్తువులు ఆకాశానంటేయని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ అన్నారు శనివారం వర్మ అధ్యక్షతన నేడు భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ ఆశీర్వదిద్దాం కార్యక్రమంలో భాగంగా ఉప్పాడ గ్రామంలో నాయకర్ కాలనీ, కొత్తపట్నం గ్రామాలలో ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ జగన్ పాలనలో నిత్యావసర, విద్యుత్ ఛార్జీలు భాదుడు, పెరిగిన వంట గ్యాస్, అన్ని రంగాలు, వర్గాలు వారిని ఇబ్బందులకు ఎలా గురి చేశారో అవన్నీ వివరించారు. అదే విధంగా తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మత్స్యకారులందరికి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అన్నీ విధాలుగా ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. మత్స్యకారులుకు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బోట్లు, వలలు, ఆయిల్ ఇంజిన్ మరియు సబ్సిడీ పై ఆయిల్ కార్డులు, మత్స్యకారులుకు ఉపయోగపడేలా మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్ నిర్మాణం, వేట సమయంలో ప్రమాద సాత్తు మరణించిన వారికి చంద్రన్న భీమా కింద 5 లక్షలు ప్రోత్సహం అందించే వారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.